క్లుప్తంగా

డిసెంబర్ 9న జాతీయ మెగా లోక్ అదాలత్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి

ధర్మవరం: పట్టణంలోని కోర్టు సముదాయంలో డిసెంబర్ 9న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లుల మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి మాట్లాడుతూ పోలీసులు, కక్షిదారులు, న్యాయవాదులు, బ్యాంకు రుణాలు పెండింగ్ ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సివిల్, క్రిమినల్ కేసులు కూడా పరిష్కరించుకోవచ్చన్నారు.

మైన్స్ నిర్వహణకు ప్రజావేదిక



మాట్లాడుతున్న ఆర్డీఓ వంశీకృష్ణ

తలుపుల: మండలంలోని ఈదులకుంట్లపల్లి సమీపంలో ఎస్సార్ మైన్స్ మై రూఫ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ ఆధ్వర్యంలో సర్వే నెంబర్ 1071,1084, 1లో 17 హెక్టార్లలో నిర్వహించే మైన్స్ నిర్వహణ కోసం శనివారం తహసీల్దార్ శ్రీధర్ అధ్యక్షతన ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రజా వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి కదిరి ఆర్డీఓ వంశీకృష్ణ, పలువురు స్వచ్ఛంద సంస్థ వారు, ఎన్జీఓలు, పర్యావరణ పరిరక్షణ వేత్తలు హాజరయ్యారు. మైన్స్ నిర్వహణకు ప్రజల నుంచి ఎలాంటి వ్యతిరేకత లేదని గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్, చెట్లు నాటే కార్యక్రమం, రోడ్లు వేయడం వంటి కార్యక్రమాలు చేపట్టి, స్థానికులకే పని కల్పించాలని కోరారు. అందుకు రూఫ్ కన్‌స్ట్రక్షన్ వారు అంగీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, సర్పంచ్ కుమారిబాయి, రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, డీటీ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

ఎస్కేయూనివర్సిటీ జట్టుకు ఎంపిక



కబడ్డీ పోటీలకు ఎంపికైన ధరణి

పుట్టపర్తి అర్బన్: ఎస్కేయూనివర్సిటీ కబడ్డీ జట్టుకు పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మంగళకర కళాశాల విద్యార్థిని ధరణి ఎంపికైందని ఆ కళాశాల కరస్పాండెంట్ సురేష్‌కుమార్ తెలిపారు. ఈనెల 22 నుంచి తమిళనాడులో జరిగే పోటీల్లో యూనివర్సిటీ తరఫున పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా శనివారం ధరణిని కళాశాల యాజమాన్యం, విద్యార్థులు అభినందించారు.

విద్యా సామగ్రి అందజేత



విద్యా సామగ్రి అందుకున్న విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలంలోని పెడపల్లి, సుబ్బరాయనిపల్లి, పెద్దతండా గ్రామాలకు చెందిన సుమారు 120 మంది ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీవాణి బ్లోసమ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి అందజేశారు. సౌతాఫ్రికాకు చెందిన లలితా జవహరిలాల్, అమీన్, కేసరి సహకారంతో విద్యార్థులకు శనివారం నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు స్వీట్లు, అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షురాలు ఏచూరి శ్రీవాణి, శ్రీనివాస్, సాయి అఖిల, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: స్థానిక కేజీబీవీ బాలికల పాఠశాలలో శనివారం జిల్లా బాలల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకటేశ్వరి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బాలల హక్కులు కాపాడేందుకు చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 ఉందన్నారు. బాల్య వివాహాల చట్టంపై కూడా అవగాహన కల్పించారు. అనంతరం బాలల హక్కులకు సంబంధించిన పోస్టర్‌లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ మమత, ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగిసిన కల్చరల్ ఫెస్ట్



కల్చరల్ ఫెస్ట్‌లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు



బహుమతులు ప్రదానం చేస్తున్న జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్ శశిధర్ తదితరులు

అనంతపురం: జేఎన్‌టీయూఏ క్యాంపస్ ఆడిటోరియంలో ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్ ఉత్సాహంగా ముగిసింది. ఆటలు, పాటలు, నృత్యాలు, ఫుడ్‌కోర్టులు, హాస్య వల్లరిలో పాల్గొన్న విద్యార్థులు.. తమలోని నైపుణ్యాలను ప్రదర్శించారు. తొలిసారిగా నిర్వహించిన వేడుక కావడంతో విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. వర్సిటీ పూర్వ విద్యార్థి, సినీ హీరోయిన్ గాయత్రి రాకతో మరింత సందడి నెలకొంది. రెండు రోజులుగా సాగిన ఈ వేడుక శనివారం సాయంత్రం అట్టహాసంగా ముగిసింది. జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాల, పులివెందుల, కలికిరి, ఓటీపీఆర్ఐ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి రిజిస్ట్రార్ సి.శశిధర్ ముఖ్యఅతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అంకితభావంతో కృషి చేసిన ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.మమత, కోఆర్డినేటర్ అంకారావు, డాక్టర్ అరుణను వీసీ డాక్టర్ జింకా రంగ జనార్దన అభినందించారు. కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ సీఈఓ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్చరల్ ఫెస్ట్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

భక్తులకు ప్రసాదాల పంపిణీ



ప్రసాదం అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి రూరల్: సత్యసాయి భక్తులకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రసాదాలు పంపిణీ చేశారు. శనివారం సత్యసాయి జయంతి ఉత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్థానిక హనుమాన్ సర్కిల్ వద్ద వైఎస్సార్‌సీపీ అర్బన్ కన్వీనర్ బీడుపల్లి రంగారెడ్డి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేపట్టారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని వందలాది మందికి ప్రసాదాలు పంపిణీ చేశారు.

వడ్డెర్లకు పార్థసారథి క్షమాపణ చెప్పాలి

నల్లమాడ: పుట్టపర్తిలో ఇటీవల జరిగిన టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి వడ్డెర్లను కించపర్చేలా మాట్లాడటం తగదని వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి సాతర్ల రామచంద్ర ఒక ప్రకటనలో మండిపడ్డారు. వడ్డెర కులస్తులు నమ్మదగిన వ్యక్తులు కాదని, వారు అమ్ముడుపోయి పార్టీలు మారుతుంటారని అనడం సరికాదన్నారు. బీకే పార్థసారథి వడ్డెర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: ప్రజలతోనే సమస్యలు నేరుగా తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకే ఇళ్ల వద్దకే వచ్చినట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 38వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం (గుడ్ మార్నింగ్) కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో డ్రైనేజీలను శుభ్రం చేయలేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎప్పటికప్పుడు కాలువలు, రహదారులు శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఇంటిపట్టా వచ్చినా బిల్లు పడలేదని పలువురు జగనన్న కాలనీల లబ్ధిదారులు ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే హౌసింగ్ ఏఈతో మాట్లాడి బిల్లులు త్వరితగతిన పడేలా చూడాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు మార్చాలని, ఇళ్లపైన విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని ప్రజలు తెలపగా, సమస్య పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు.

ఏ చిన్న సమస్యా పెండింగ్ ఉండకూడదు..

అనంతరం ఎమ్మెల్యే సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ఏ చిన్న సమస్య కూడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు.



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలులో భాగంగా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. వాటిని క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందించాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షంషాద్‌బేగం, కోఆప్షన్ సభ్యుడు కరీం, కౌన్సిలర్లు, నాయకులు చింతా మారుతి, కాచర్ల అంజి, చాంద్‌బాషా, కోటిరెడ్డి బాలిరెడ్డి, ఉడుముల రాము, చందు, కత్తె పెద్దన్న, ఎస్‌పీ బాషా, బడన్నపల్లి నరసింహులు, బైముతక రమణ, పరందామరెడ్డి, బెస్త వెంకటరమణ, బడన్నపల్లి విజయ్‌కుమార్, రమణ, తిరుమల, హౌసింగ్ ఏఈ బాలాజి, మున్సిపల్ ఏఈ ప్రతాప్, టూటౌన్ ఏఎస్ఐ దోనాసింగ్, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు



అర్బన్ హెల్త్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

- కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి అన్నారు. పట్టణ పరిధిలో నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్ల ఏర్పాటులో భాగంగా శనివారం మూడో వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇప్పటికే కుటాగుళ్ల, మూర్తిపల్లిలో ఒక్కొటి చొప్పున ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాడు–నేడు కింద ప్రభుత్వాసుపత్రుల్లో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల కల్పన జరిగిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ వంటి పథకాలే ఈ ప్రభుత్వం వైద్యశాఖలో తెచ్చిన మార్పునకు నిదర్శనమన్నారు. ప్రధానంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన రోగులకు విశ్రాంతి సమయంలో రోజుకు రూ.250 చొప్పున ఆరు నెలల వరకూ భృతిని ఇస్తున్నట్లు గుర్తు చేశారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో నిత్యం వైద్యుల పర్యవేక్షణతో పాటు ఆరోగ్య సిబ్బంది ఉంటారని, ఇక్కడ అన్ని రకాల వైద్య సేవలు అందుకోవచ్చన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తెచ్చిన 108తో పాటు 104 వైద్య సేవలను చంద్రబాబు సర్కారు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తే ఇప్పుడు వాటి సేవలను విస్తృతం చేయడంతో పాటు ఇంకా ఎన్నో రకాల వైద్య సేవలను ప్రజల ముంగిటకే తెచ్చిన ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, పలువురు కౌన్సిలర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయి విద్యాప్రమాణాలు అందాలి



మాట్లాడుతున్న స్టేట్ అబ్జర్వర్ వెంకటరెడ్డి

కదిరి అర్బన్: ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులందరికీ కార్పొరేట్ స్థాయి విద్యాప్రమాణాలు అందించాలని లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం స్టేట్ అబ్జర్వర్ వెంకటరెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు రోజులు కదిరి డివిజన్ పరిధిలోని 12 మండలాల ఎంఈఓలకు లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. శనివారం ఈ కార్యక్రమానికి స్టేట్ అబ్జర్వర్ వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ విద్యావిధానం ఆశించినవిధంగా అభ్యసన ఫలితాలు ఆధారిత బోధనకు ఉపాధ్యాయులు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న విద్యావిధానం గురించి ఉపాధ్యాయులు తెలుసుకోవాలన్నారు. ఉత్తమ సమాజానికి కావాల్సిన నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందింపచేయాలన్నారు. రిసోర్స్ పర్సన్స్ నాగేంద్రకుమార్‌రెడ్డి, మురళి, రవినాయక్, వెంకట్, శంకరమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నల్లచెరువు: మండలంలోని బాలేపల్లి తండాకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రాజు నాయక్ తండ్రి వైఎస్సార్ సీపీ కార్యకర్త నారాయణ నాయక్ (85) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నిరంజన్‌రెడ్డి, రమణారెడ్డి, హైటెక్ రమణ నాయక్, వనం శ్రీనివాస్‌రెడ్డి, అంజనప్పనాయక్,బాలక్రిష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

తలుపుల: మండల కేంద్రం మెయిన్ రోడ్డుకు చెందిన రెడ్డి బాషా బట్రేపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి శనివారం కదిరి ఏరియా ఆస్పత్రిలో మృతదేహాన్ని సందర్శించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుని, కుటుంబ సభ్యులను ఓదార్చి, 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకేబాబు,మౌలా, ఉసేన్‌మియా పాల్గొన్నారు.

పీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

ధర్మవరం అర్బన్ : పీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మంజులనరేంద్ర తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీఎస్‌యూ మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. నెల్లూరు నగరంలో జరగనున్న పీఎస్‌యూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండో మహాసభల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నందు, దేవనాథ్, కిశోర్, వంశి, భార్గవ్ పాల్గొన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న పెడపల్లి సొసైటీ సభ్యులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం వద్ద సహకార వారోత్సవాలను సిబ్బంది శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో అధ్యక్షుడు డోలా రామచంద్రారెడ్డి జెండా ఆవిష్కరించి వందనం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రహంతుల్లా, సీఈఓ నరసరాం పాల్గొన్నారు.

తలుపుల: స్థానిక సహకార పరపతి సంఘ కార్యాలయంలో శనివారం 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తొలుత సహకార సంఘ కార్యాలయం వద్ద జెండా ఎగురవేసి, సహకార గీతం ఆలపించారు. వక్తలు మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి రైతులు, అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్లు షాహిద్ బాషా, మురళీమోహన్, హనుమంతరెడ్డి, సీఈఓ చంద్ర శేఖర్, సహకారం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు

పుట్టపర్తి అర్బన్: సహకార సంఘాల ద్వారా రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయనున్నట్లు సొసైటీ అధ్యక్షురాలు ఉషారాణి పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి మండలం పెడపల్లి సొసైటీ ఆవరణలో అఖిల భారత 70వ సహకార వారోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఏవి రమణారెడ్డితో కలిసి ఉషారాణి మాట్లాడారు. అర్హులైన రైతులకు రుణాలు సకాలంలో మంజూరు చేస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు భాస్కర్‌రెడ్డి, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



తాడిమర్రి: వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



ధర్మవరం: చిత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



గాండ్లపెంట: వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బత్తలపల్లి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బత్తలపల్లిలోని విద్యాధర పాఠశాలలో శనివారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బత్తలపల్లి శాఖ గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విభిన్న అంశాలపై పట్టు సాధించడానికి వ్యాసరచన పోటీలు దోహదపడతాయన్నారు. స్వాతంత్య్ర సమరయోధులు చిత్రాలు, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల కేంద్రంలోని గ్రంథాలయం, కటారుపల్లి గ్రంథాలయం ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు గ్రంథాలయాలు–వాటి ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.అలాగే గ్రంథాలయాల ప్రాముఖ్యతంపై వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి ఈ నెల 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు గ్రంథాలయాధికారులు ఫరియాబాను, లక్ష్మీనాయక్ తెలిపారు.

తనకల్లు: స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం, క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మస్తాన్‌వలి మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల పోటీలను ఏర్పాటు చేశామన్నారు. వారోత్సవాలు ముగింపు రోజు ఈ నెల 20న విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

చెన్నేకొత్తపల్లి: స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కృష్ణయ్య, ఎస్ఐ నాగరాజు, విశ్రాంత ఉపాధ్యాయులు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నాయకుల చిత్రాలపై డ్రాయింగ్ పోటీలు

ధర్మవరం అర్బన్: జాతీయ నాయకుల చిత్రాలపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారిణి అంజలి సౌభాగ్యవతి తెలిపారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం పోటీల్లో 150 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముత్యాలప్ప, శివ, గ్రంథాలయ సిబ్బంది శివమ్మ, రమణనాయక్, గంగాధర్, ముకుంద, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్‌లో వ్యాసరచన పోటీలు

తాడిమర్రి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని గ్రంథాలయ అధికారి డి.శీనానాయక్ విద్యార్థులకు గ్రంథాలయాలు ఆవిర్భావం, స్వాతంత్య్ర సమరయోధులు తదితర అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం స్వాతంత్య్ర సమరయోధుల చిత్ర లేఖనం, వాలీబాల్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు గ్రంథాలయ అధికారి తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణ, నాగరాజు, శ్రీరాములు నాయక్, రాజేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: గ్రంథాలయధికారి ప్రసాద్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు వారోత్సవాలు ముగింపు రోజు ఈ నెల 20న బహుమతులు ప్రదానం చేస్తామని ఆయన తెలిపారు.

కులగణనపై సచివాలయ సిబ్బందికి శిక్షణ

గాండ్లపెంట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కుల గణన సచివాలయ సిబ్బందికి మండల ప్రత్యేకాధికారి మోహన్‌రామ్ అధ్యక్షతన ఎంపీడీఓ రామానాయక్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 7 రోజుల పాటు కులగణన సర్వే నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఇంట్లో ఆధార్‌కార్డు మేరకు కుటుంబ సభ్యులందరూ వేలిగుర్తులు వేయించాలన్నారు.

20 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

మండల వ్యాప్తంగా ఈ నెల 20 నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. 15 సంవత్సరాలు నిండిన బాల, బాలికలు కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాట్మింటన్ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ కార్యక్రమం గ్రామస్థాయిలో వచ్చే నెల 15 నుంచి 20 వరకూ నిర్వహిస్తామన్నారు. సచివాలయ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.